క్లుప్తంగా

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



విగ్రహాలతో అయ్యప్ప స్వాములు

బోథ్: మండలంలోని మార్కండేయ ఆలయం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. సోమవారం సుబ్రహ్మణ్యస్వామి 11వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప సన్నిధానం నుంచి మార్కండేయ ఆలయం వరకు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పల్లకి శోభాయాత్ర నిర్వహించారు. అయ్యప్ప పాటలతో పలు వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

మోడల్ స్కూల్ ప్రవేశానికి దరఖాస్తులు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని బంగారుగూడ మోడల్ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 10వ తరగతి వరకు ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో ఈనెల 6 నుంచి 28 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. మెరిట్ ఆధారంగా విద్యార్థుల ఎంపిక ఉంటుందన్నారు.

సూపర్ చెక్ ద్వారా లబ్ధిదారుల ఎంపిక



సర్వే చేస్తున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఇచ్చోడ: సూపర్ చెక్ ద్వారా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక చేయనున్నట్లు ఎంపీడీవో లక్ష్మణ్ తెలిపారు. సోమవారం మండలంలోని అడేగామ(బి)లో సూపర్ చెక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదటి దశలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు.

అయోడిన్ లోపంపై కళా ప్రదర్శన

ఇచ్చోడ: స్మార్ట్ ఇండియా స్వచ్ఛం సంస్థ ద్వారా సోమవారం మండలంలోని బోరిగామ, మాదాపూర్, ఇచ్చోడ ఆర్టీసీ బస్టాండ్‌లో కళప్రదర్శన నిర్వహించారు. అయోడిన్ లోపం వలన కలిగే వ్యాధులు గురించి పాటల రూపంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐజీడీ జిల్లా కోఆర్డినేటర్ రాజేశ్, ఎంఎల్‌హెచ్‌పీ ఇంద్రజిగిత్తె, గీతాంజలి, శశిమాల, జాకీర్, భూమన్న పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడికి స్వాగతం

నేరడిగొండ: కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపదాస్ మున్షిలు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ఎన్నికల శంఖారావం పేరిట పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశానికి వెళ్తుండగా రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు వారికి గజమాలతో స్వాగతం పలికారు. పూల బొకెలు అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు పసుల చంటి, ఆడె వసంత్‌రావు, బద్దం పోతారెడ్డి, నాయిడి రవి, పాల శంకర్, జాదవ్ కపీల్‌దేవ్, ఇసాఖొద్దీన్, ఋక రాములు పాల్గొన్నారు.

ఎస్టీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలి

నేరడిగొండ: జిల్లాలో ప్రత్యేక ఎస్టీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని లంబాడాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. సోమవారం మండల కేంద్రానికి చేరుకున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా గిరిజన ఆదివాసీ విద్యార్థుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక ఎస్టీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని, గిరిజన ఆదివాసీ విద్యార్థుల కోసం వందశాతం సీట్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో లైవ్ మండల అధ్యక్షుడు రాథోడ్ సందీప్ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని బ్రాహ్మణవాడకు చెందిన గుగ్గిళ్ల రవి అనే యువకుడు అదృశ్యమైనట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయల్దేరి వెళ్లిన యువకుడు ఇంటికి తిరిగి రాలేదు. చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి గుగ్గిళ్ల నర్సింగ్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఆయన మానసిక ఆరోగ్య పరిస్థితి సరిగ్గా లేదని పేర్కొన్నారు.

చెట్లకిందే చదువులు..!

- అసంపూర్తిగా అర్లి(టి) ప్రాథమిక పాఠశాల
- సరిపడా గదులు లేక ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



అసంపూర్తిగా ఉన్న అదనపు గదులు



ఆవరణలో చెట్ల కింద చదువుతున్న విద్యార్థులు

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) ప్రాథమిక పాఠశాల విద్యార్థులు అవస్థలు పడుతూ చదువు కొనసాగిస్తున్నారు. బోధనకు సరిపడా ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ తరగతి గదులు లేక ఇబ్బందులు తప్పడం లేదు. అదనపు గదుల నిర్మాణానికి గత ప్రభుత్వం మనఊరు మనబడి కింద ప్రత్యేకంగా నిధులు కేటాయించి పనులు చేపట్టింది. ఆ పనులు పూర్తికాక అర్లి(టి) పాఠశాలకు చెందిన విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఆయా నిధులతో చేపట్టిన పాఠశాల ప్రహరీ, మూత్రశాలలు పూర్తికాక అసంపూర్తిగా మిగిలాయి. అదనపు గదుల నిర్మాణం కోసం సైతం రూ.38 లక్షలు మంజూరు చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ బిల్లులు రావడం లేదని వదిలేశాడు. దీంతో భవనం అసంపూర్తిగా మారింది.

122 మంది విద్యార్థులకు 3 గదులు..

పాఠశాలలో ప్రస్తుతం ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 122 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఐదు తరగతులకు కేవలం మూడు గదులు మాత్రమే ఉండటంతో విద్యార్థులకు గదులు సరిపోవడం లేదు. దీంతో విద్యార్థులను ఆరుబయట ఆవరణలో కూర్చోబెట్టాల్సిన పరిస్థితి. ప్రస్తుతం సరిపడా తరగతి గదులు లేక బయట ఆవరణలో చెట్ల కింద కూర్చోబెట్టి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అదనపు గదుల నిర్మాణాన్ని పూర్తి చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

కింద కూర్చుంటున్నాం



పాఠశాలలో తరగతులకు సరిపడా గదులు లేక ఇబ్బంది పడుతున్నాం. అదనపు గదులు నిర్మిస్తున్న భవనం అసంపూర్తిగా ఉండటంతో చెట్ల కింద తరగతులను నిర్వహిస్తున్నారు. కింద కూర్చోవడం ఇబ్బందిగా ఉంది. వెంటనే గదుల నిర్మాణాన్ని పూర్తి చేయాలి.

– మహాలక్ష్మి, విద్యార్థిని, ఐదో తరగతి

ఒకేగదిలో అన్ని తరగతులు



పాఠశాలలో ప్రతీ తరగతికి ప్రత్యేకంగా గదులు లేకపోవడంతో ఒకేచోట అన్ని తరగతి వాళ్లం చదువుకుంటున్నాం. వర్షాకాలంలో అయితే వరండాలో వర్షం నీటి వలన కూర్చోలేని పరిస్థితి. దుల నిర్మాణాన్ని పూర్తి చేయడంతో డైనింగ్ హాల్ నిర్మిస్తే బాగుంటుంది.

– జై ఆదిత్య, విద్యార్థి, ఐదో తరగతి

ఎమ్మెల్సీ కవితకు మద్దతుగా బైక్ ర్యాలీ



నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నార్నూర్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కుమురంభీం జిల్లా జైనూర్, వాంకిడి, గోల్లెటి పర్యటన సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో కమాన్ నుంచి హస్నాపూర్, నార్నూర్ చౌరస్తా వరకు భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు. మాజీ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ నాయకులతో భారీగా చేరుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఫాక్స్ చైర్మన్ అడే సురేశ్, విష్ణు ఫడ్, మాజీ ఎంపీపీ కనక ప్రభాకర్, లోఖండే చంద్రశేఖర్, రూప్‌దేవ్, హన్మంతరావు పాల్గొన్నారు.

కవితను కలిసిన నాయకులు

ఇచ్చోడ: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సోమవారం ముఖరా(కె) మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి, మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన ఆమెను నేరడిగొండ మండల కేంద్రంలోని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసంలో కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పాల్గొన్నారు.

నేరడిగొండ: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోమవారం నేరడిగొండ మండల కేంద్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆమెకు పూల మొక్క అందజేసి ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే సతీమణి హరిప్రియ కవితకు తిలకందిద్దారు. అనంతరం కుటుంబసభ్యులతో కలిసి ఫొటోలు దిగారు.

హక్కుల సాధనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న భీంరావు నాయక్

బేల: లంబాడా హక్కుల సాధనకు కృషి చేయాలని అఖిల భారతీయ బంజారా సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీంరావు నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని సైద్‌పూర్ గ్రామంలో సమావేశం నిర్వహించారు. ప్రతిఒక్కరూ సంత్ సేవాలాల్ మహరాజ్ చూపిన మార్గంలో నడవాలని, విద్య, ఆరోగ్యం, ఆర్థిక అభ్యున్నతి కోసం ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జాదవ్ రెడ్యనాయక్, మండల అధ్యక్షుడు రాథోడ్ రోహిదాస్, ప్రధాన కార్యదర్శి రాథోడ్ సుధాకర్, దినేష్, రోహిదాస్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోవాలి

- ఎస్పీకి భీంపూర్ గ్రామస్తుల వినతి

ఆదిలాబాద్‌టౌన్: భీంపూర్ మండలం వడూర్ గ్రామాన్ని ఆనుకుని ఉన్న పెన్‌గంగ నుంచి కొందరు అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని భీంపూర్ గ్రా మస్తులు పేర్కొన్నారు. ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోవాలని సోమవారం జిల్లా కేంద్రంలో ఎస్పీ గౌస్ ఆలంను కలిసి వినతి పత్రం సమర్పించారు. పెద్ద పెద్ద వాహనాల్లో ఇసుకను తరలిస్తుండడంతో గ్రామంలోని రోడ్లు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. ప్రజలు, మూగజీవాలు ప్రమాదాలకు గురవుతున్నట్లు తెలిపారు. వినతిపత్రం సమర్పించిన వారిలో మాజీ ఎంపీటీసీ భోజన్న, సుదర్శన్, రమణారెడ్డి, శ్రీనివాస్, రసూల్, సురేందర్ తదితరులున్నారు.

రోడ్డు భద్రతా వారోత్సవాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీఐ మోగిలి

ఉట్నూర్‌రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో సోమవారం రోడ్డు భద్రత వారోత్సవాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీఐ మొగిలి మాట్లాడుతూ విద్యార్థులు, యువత రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్సై మనోహర్, ప్రిన్సిపాల్ ధన్‌రాజ్, అధ్యాపకులు సువర్ణ, శ్రీలత, గణేశ్, వినోద్, లక్ష్మణ్, దశరథ్, కిషోర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

నేరడిగొండ: నిర్మల్ లైబ్రెరీలో చైర్మన్ సయ్యద్ అర్జుమండ్ అలీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన సంవిధాన్ జిందాబాద్ కార్యక్రమంలో ఆడే గజేందర్ న్యాయకత్వంలో పలువురు యువ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఇచ్చోడ మండల తాజామాజీ ఎంపీటీసీ జాహిద్, నేరడిగొండ మండల యువ నాయకులు సద్దాం హుస్సేన్, సయ్యద్ సాబీర్, బజార్‌హత్నూర్ యువ నాయకుడు సల్మాన్ చేరారు.

సహకార సంఘ కార్యాలయంలో చోరీ



దుండగులు పగల గొట్టిన తాళం

తలమడుగు: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చొరబడి తాళం పగలగొట్టి సహకార సంఘంలో గల దాదాపు రూ. 50 వేల రూపాయలు నగదును దోచుకెళ్లినట్లు సిబ్బంది తెలిపారు. సోమవారం ఉదయం సిబ్బంది విధులకు హాజరుకాగా సంఘానికి సంబంధించిన కార్యాలయానికి తలం పగలగొట్టి ఉంది. కార్యాలయంలో ఎరువులు విక్రయించగా వచ్చిన రూ. 50 వేల రూపాయలు దుండగులు తీసుకెళ్లినట్లు సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఎస్సై అంజమ్మ ఉన్నతాధికారులకు సమాచారం అందించి క్లూస్ టీమ్‌ను పంపించగా క్లూస్ టీం కార్యాలయానికి చేరుకొని వేలిముద్రలు సేకరించారు. త్వరలోనే దుండగులను పట్టుకుంటామని పోలీసు అధికారులు తెలిపారు.

పోటాపోటీగా ఫ్లెక్సీల ఏర్పాటు



ఇరు పార్టీల ఫ్లెక్సీలు

నేరడిగొండ: ఆదిలాబాద్ జిల్లాకు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రావడంతో నేరడిగొండ మండల కేంద్రం సందడిగా మారింది. సోమవారం ఉదయం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకురాలు, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపదాస్ మున్షిలు రావడంతో ఇరు పార్టీల నాయకులు పోటాపోటీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీంతో మండల కేంద్రంలో సందడి వాతావరణం నెలకొంది.

పేకాట స్థావరంపై దాడులు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండలంలోని గిమ్మ శివారు ప్రాంతంలో నలుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు జైనథ్ ఎస్సై పురుషోత్తం తెలిపారు. పక్కా మేరకు దాడి చేసి పట్టుకోవడం జరిగిందన్నారు. వారి నుంచి రూ.1లక్ష 8వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పట్టుబడ్డవారిలో ఆదిలాబాద్ పట్టణానికి చెందిన కిషోర్, మహారాష్ట్రలోని కిన్వట్‌కు చెందిన బోడ రవి, మహ్మద్ అహ్మద్, భగ్వి రాథోడ్ ఉన్నట్లు ఎస్సై వెల్లడించారు.

సంక్షిప్త వార్తలు

క్యాలెండర్ ఆవిష్కరణ

బోథ్: ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్ల సంఘం నూతన క్యాలెండర్, డైరీలను సబ్ ట్రెజరీ అధికారి విద్యాసాగర్, సంఘం సభ్యులు సోమవారం ఆవిష్కరించారు. పెన్షనర్ల సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రాజేశ్వర్ రెడ్డి, మురళీధర్, రావుల గణపతి, దివాకర్ రెడ్డి, బారె గోవర్ధన్, సుధాకర్ పాల్గొన్నారు.

పూలాజీబాబా సంస్థాన్ వార్షికోత్సవం

బోథ్: మండలంలోని పట్నాపూర్ గ్రామ పంచాయి పరిధిలోని ఇంకర్‌పల్లె గ్రామంలో పూలాజీ బాబా సంస్థాన్ ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. సంస్థాన్ అధ్యక్షుడు ఆడెం నాగోరావ్ మాట్లాడుతూ.. పూలాజీ బాబా చూపిన సన్మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో కోండూబాసర్ దేవ్ రావ్, సార్మెడి భీంరావ్, ఉపాధ్యాయులు మడావి లాల్‌దేవ్ పంద్రం శంకర్, ఆడెం పొల్లు, అర్క లక్ష్మణ్ పాల్గొన్నారు.

సన్మానం

కైలాస్‌నగర్: టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిలను గౌడజన హక్కుల పోరాట సమితి(మోకుదెబ్బ)రాష్ట్ర కమిటీ నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ సమీక్ష సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన వారిని కలిసి శాలువాతో సత్కరించారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి



మాట్లాడుతున్న ఎస్సై తిరుపతి

ఇచ్చోడ: విద్యార్థులు లక్ష్యంతో చదవాలని ఎస్సై తిరుపతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి చదువుకోవాలని సూచించారు. సైబర్ క్రైం వలలో పడవద్దని, తెలియని వారితో ఫోన్ మాట్లాడవద్దన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేశ్ జోషి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

నేరడిగొండ: ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్‌ఈవో పవార్ రవీందర్ అన్నారు. సోమవారం మండలంలోని మాధపూర్, గోండుగూడ, తర్నం గ్రామాల్లో సికిల్‌సెల్ వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి సోకిన వారి రక్తంలోని ఎర్ర రక్త కణాలు గుండ్రంగా కాకుండా, వంకర తిరిగి ఉంటాయన్నారు. దీంతో శరీరంలోని అన్ని అవయవాలకు ఆక్సీజన్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ముందు జాగ్రత్త మినహా ఈ వ్యాధికి మందులు లేవన్నారు. సరైన సమయంలో చికిత్స చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ నరేందర్ రెడ్డి, ఏఎన్‌ఎం గంగామణి, శ్యామల, ఆశ కార్యకర్త పెందూర్ సావిత్రిబాయిలు పాల్గొన్నారు.

పంట వివరాలు నమోదు చేసుకోవాలి



రిజిస్టర్ పరిశీలిస్తున్న ఏడీఏ రాంకిషన్

తలమడుగు: రబీ పంటలు సాగు చేస్తున్న రైతులందరూ తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఏడీఏ రాంకిషన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం కార్యాలయాన్ని తనిఖీ చేశారు. పంటల విక్రయించే సమయంలో రైతులు ఇబ్బందులు పడకుండా ముందస్తుగా నమోదు చేసుకోవాలన్నారు. అదే విధంగా రబీ పంట రైతులకు ఎలాంటి ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా.. వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు. అనంతరం సహకార సంఘంలో ఎరువులను తనిఖీ చేసి, రిజిస్టర్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీఈవో మోతే శ్రీనివాస్, వ్యవసాయాధికారి ప్రమోద్ రెడ్డి, సిబ్బంది సాగర్, భీమ్‌రావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలి



నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు



కరపత్రాలు దహనం చేస్తున్న నాయకులు

నేరడిగొండ: రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలి బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లే నానక్ సింగ్‌లు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో నిరసన తెలిపారు. రైతుబంధు ఎకరాకు రూ.15వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడేమో రూ.12వేలు ఇస్తామనడం సిగ్గుచేటన్నారు. వెంటనే పూర్తిస్థాయిలో రైతు రుణమాఫీ చేపట్టాలని, లేనియెడల ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రాథోడ్ సురేందర్, అంబాజీ, నారాయణ, కరణ్ సింగ్, కైలాస్, పవన్, సరీష్‌చంద్, ఆత్మారాం పాల్గొన్నారు.

ఎకరానికి రూ. 15 వేలు చెల్లించాలి

ఇంద్రవెల్లి: రైతుభరోసా పథకంలో రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం ఎకరానికి రూ. 15 వేలు ఇవ్వాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మారుతి డొంగ్రె డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. రైతు భరోసా, ఆరు గ్యారంటీ కరపత్రాలను దహనం చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు.

గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీలు

తలమడుగు: మండలంలోని ఝరి గ్రామపంచాయతీ పరిధిలోని అనుబంధ గ్రామాలైన టోకిగుడా, షేర్‌గుడా గ్రామాలను కలిపి కొత్త గ్రామపంచాయతీని ఏర్పాటు చేయాలని ఆదివాసీ గిరిజనులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ రాజ్ మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయకుంటే ఎన్నికలను బహిష్కరిస్తామన్నారు. ఇటీవల ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన పున్నగూడలో రెండు గ్రామాలను కలపడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. కార్యక్రమలో షేర్‌గూడ, టోక్కిగుడ గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ప్రభాకర్ రెడ్డి

ఎదులాపురం: ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఇచ్చిన హామీ మేరకు రూ. 2 వేల పెన్షన్ రూ. 4 వేలు చేయాలని, గృహలక్ష్మి పథకం కింద రూ. 2500 ఇవ్వాలని, ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని వెంటనే ప్రారంభించాలన్నారు. ఇందులో నాయకులు కుంటాల రాములు, అరుణ్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అర్గాంగి రమేశ్, గణేష్ పాల్గొన్నారు.

గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాంబాబు

నార్నూర్: గర్భిణులు ప్రతీనెల ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో గర్భిణులపై ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలతో పాటు అంగన్‌వాడీ టీచర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అవసరం ఉన్న వారికి ఐరన్ మందులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో లక్ష్మి, హెచ్‌ఈవో రాథోడ్ తులసిదాస్, హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో నాన్‌టీచింగ్ పోస్టులకు దరఖాస్తులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీ)ల్లో ఖాళీగా ఉన్న నాన్‌టీచింగ్ పోస్టుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీత తెలిపారు. మావల కేజీబీవీలో హెడ్‌కుక్, అసిస్టెంట్ హెడ్‌కుక్, నైట్, డే వాచ్‌మెన్‌లు, స్వీపర్ ఐదు పోస్టులు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్‌రూరల్ కేజీబీవీలో నైట్ వాచ్‌మెన్, తాంసి కేజీబీవీలో స్వీపర్, తలమడుగు కేజీబీవీలో అకౌంటెంట్, బేల కేజీబీవీలో నైట్ వాచ్‌మెన్, జైనథ్ కేజీబీవీలో డే వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. మొత్తం 10 పోస్టులు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 7 నుంచి 10 వరకు ఆయా మండల కేంద్రాల్లోని ఎంఈవో కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.